

# నా కళ్ళతో నాన్న

– లిపి మల్లాది



ఆంధ్రుల ఆహ్లాద రచయిత మల్లాది వెంకట కృష్ణమూర్తిగారు ఇటీవల ఫేమిలీ ఆల్బమ్ పేరుతో సొంత అనుభవాలను రచనలో వ్రాశారు. వందల, వేల పాత్రలను సృష్టించిన మల్లాదిగారిని వాళ్ళ అమ్మాయి కళ్ళతో చూస్తే ఎలా ఉంటుంది? అందుకు సమాధానమే ఈ ధారావాహిక. మల్లాదిగారు, పద్మజగార్లకు ముగ్గురు సంతానం - కావ్య, ఊహ, లిపి. ముగ్గురూ అమెరికాలోనే ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు చేస్తున్నారు. చిన్నమ్మాయి లిపి, వాళ్ళ నాన్నగారి గురించి వ్రాస్తున్న ఈ సంఘటనలు పాఠకులకు ఆసక్తికరంగా ఉంటాయని ఆశిస్తున్నాం.

*(గత సంచిక తరువాయి)*

**చిన్నతనంలో** జరిగిన కొన్ని సంఘటనలు మనకి జీవితాంతం గుర్తుండిపోతాయి. నాకు అలా గుర్తున్నవి చాలావరకు మా నాన్నతో జరిగినవే. రోజూ సాయంత్రం ఫ్రెండ్స్‌తో ఆడుకుని ఇంటికి వచ్చే సమయానికి జుట్టంతా చింపిరిగా మొహం మీద పడుతూ ఉండేది. "కళ్ళమీద జుట్టు వెనక్కనుకో" అని మా అమ్మ, నాయనమ్మ పదే పదే చెప్పేవారు. అప్పుడు నాకు ఏడేళ్ళు. బుర్రలోకి వచ్చిన ఓ చిట్కాని "నాన్నా మొహం మీద పడిన జుట్టుని పడగానే కట్ చేస్తే ఇంక నా కళ్ళమీద జుట్టు పడదు" అని మేధావిలా మా నాన్నతో పంచుకున్నాను.

"అప్పుడు నీ జుట్టు బోడిగుండౌతుంది" అని మా నాన్న నవ్వుతూ అనడం నాకు కళ్ళకి కట్టినట్టు కనబడుతుంది. చిన్నప్పుడు అందరిలాగా నేనూ బొమ్మలతో ఎక్కువ ఆడుకునేదాన్ని. నా బొమ్మగురించి మాట్లాడుతూ "పాప" అని సంబోధించేదాన్ని. నాకు ఏడేళ్ళున్నప్పుడు మా నాన్న కావ్యకి నా తరపున ఈ మెయిల్‌లో పంపిన గ్రీటింగ్ కార్డ్ నాకు ఇంకా గుర్తుంది. అప్పుడే పుట్టిన పిల్ల ఫోటో, దానికింద "సాబ్...సాబ్.. సాబ్.. ఐ బి కేం ఏ మదర్" అని రాసి ఉంది. అది చూసిన తరువాత మా ఇంట్లో అందరం నేను 'పాప' అన్న ప్రతిసారి ఎంతో నవ్వుకున్నాం. ఆ బొమ్మకి రకరకాల బట్టలు లేకపోవడంతో నాకు పొట్టైన గౌన్లు వేయడం గమనించిన కావ్య జాలిపడింది. ఆ రోజు సాయంత్రం నుండి తెల్లవారు ఝూముదాకా నా బొమ్మ కోసం ఓ పింక్ సిల్క్ క్లాత్‌తో స్కర్ట్, బ్లౌజ్ కుట్టి మర్నాడు నన్ను సర్‌ప్రైజ్ చెయ్యడం నేను ఎప్పటికీ మర్చిపోలేను.

నాకు ఏడెనిమిదేళ్ళున్నప్పుడు జరిగిన సంఘటనవల్ల ఈ రోజుకీ నేను మందు వేసుకున్న ప్రతిసారి మా నాయనమ్మ గుర్తుకొస్తారు. "పండూ, నాయనమ్మకి రెస్టిల్ టాబ్లెట్ ఇవ్వు" అని కిచెన్‌లో పనిచేస్తూ మా అమ్మ అంది.

ఎంతో ఉత్సాహంగా "నాయనమ్మకి మందు నేనిస్తాను... నేనిస్తాను.." అంటూ మా నాన్న చేతిలోంచి మందుల అట్టను లాక్కుని అందులోంచి ఒకటి తీయడానికి ఎంతో కుస్తీ పడ్డాను. పైన ఉన్న ట్రాన్స్‌పరెంట్ ప్లాస్టిక్‌ని తీయాలనుకుని నానా తంటాలుపడుతున్న నన్ను చూసి నవ్వుతూ నాన్న, నాయనమ్మ మాట్లాడలేకపోయారు. నన్ను ఆగమని మా నాయనమ్మ చేత్తో సైగ చేసి కాసేపటికి నవ్వేగాక "ఇలా నొక్కితే అది వెనక నుండి వస్తుంది" అని నేర్పారు.

అలా నాకు బాగా గుర్తుండిపోయిన మరో రోజు మా నాయనమ్మ నాకు తమిళం నేర్పుతుండగా నేను ఒక వాక్యంలో ఓ తప్పు పదాన్ని వాడాను. ఆవిడ నవ్వడం గమనించి ఆ వాక్యాన్ని సరిచేసే ప్రయత్నంలో మరో రెండు తప్పు పదాలు వాడినప్పుడు మా నాయనమ్మ పెద్దగా నవ్వడం నాకు, నిన్నే జరిగిన సంగతిలా అనిపిస్తుంది.

ఓ సారి పిల్లలంతా కలిసి దెయ్యం ఆట ఆడుకుంటున్నప్పుడు మా పెదనాన్నగారు ఇంటికి వచ్చారు. "ఇలా కాదే దెయ్యం ఆట ఆడేది" అని నోట్లో వెలిగించిన రెండు అగరొత్తులు పెట్టుకుని, ఓ తెల్ల వస్త్రాన్ని తలమీద కప్పుకుని, భయంకరమైన శబ్దం చేస్తూ మా దగ్గరికి రాబోయారు. మిగిలిన పిల్లలకి అది ఎంతో ఉత్సాహం కలిగించినా, నేను మాత్రం తెగభయపడి ఏడ్చి గోలచేసాను.

"నేనే లిపి, పెదనాన్నని దయ్యాన్ని కాదు" అని ఆయన నవ్వుతూ చెప్పినా,

"నేను ముట్టుకున్నా. ఏం కాలేదు చూడు" అని మిగిలినవారు అన్నా నా భయం పోలేదు కొంతసేపు అలా గడిచాక ఇంటికొచ్చిన మా నాన్నమాత్రమే నా భయాన్ని దూరం చెయ్యగలిగారు.

అదృష్టవశాత్తూ నా చిన్నప్పటి బాధ జ్ఞాపకాలని కూడా మా కుటుంబమంతా కలిసి సంతోషకరంగా మార్చారు. నాకు నాలుగైదేళ్ళ వయసున్నప్పుడు నేను ఏడుస్తూ ఓ మూలకి కూర్చున్నాను. అప్పుడు కావ్య, ఊహ ఇద్దరు కలిసి "టటటాయ్... టటటాయ్. మేము నీ దోస్త్ ఉంటున్నాం. టటటాయ్.. టటటాయ్" అని పాడుతూ డాన్స్ చేస్తూ నా గదిలోకి రావడం నాకు ఇంకా గుర్తుంది. కొన్నేళ్ళక్రితం వరకు ఏ వస్తువు కిందపడినా "ఛీ, ముట్టుకోకు" అని వెంటనే డస్ట్‌బిన్‌లో పడేసేదాన్ని.

"పెన్ కేం అంటుతుంది? నాకు బోలెడు రాసుకునే పని ఉంది" అని మా అమ్మ అన్నా పట్టించుకునేదాన్నికాదు. ఓ రోజు ఇంట్లో నడుస్తూ కాలుజారి నేను కింద పడి ఏడుపు మొదలుపెట్టబోయాను. అది గ్రహించిన మా అమ్మ "లిపి కింద పడింది. వెళ్ళి డస్ట్‌బిన్‌లో కూర్చుంటుందేమో?" అని నన్ను నవ్వించింది. తెలుగులో ఒత్తులు నేర్చుకోక ముందు "అమ్మ, ఇది వారా న్యూస్ పేపర్. వార్తా కాదు" అని ఒత్తులు తీసేసి నెమ్మదిగా గంటకో వాక్యాన్ని చదువుతూ మా అమ్మని విసిగించినా ఓపికగా కాఫీ తాగుతూ నన్ను ఒళ్ళో కూర్చోపెట్టుకోవడం నాకున్న మరో జ్ఞాపకం.

ఓ రోజు నేనూ, మా అమ్మ కలిసి చూస్తున్న సినిమాలో జుట్టు కత్తిరించే మంగలివాడు మంగళవాద్యాలు వాయించడం చూసి "అదేంటి? సినిమా బిగినింగ్‌లో అతను మంగలివాడు అని చెప్పారు కదా? మరి మంగలి వాద్యాలు వాయిస్తున్నాడేంటి?" అని అడిగాను.

"మంగలివారే వాయిస్తారు" అని మా అమ్మ చెప్పింది.

"ఓ... అందుకేనా మంగలి వాద్యాలు అంటారు?" అని నేను అడిగిన వెంటనే మా నాన్న నవ్వి "కాదమ్మా. అవి మంగళవాద్యాలు" అని అసలు విషయాన్ని వివరించారు. ఇలాంటి విషయాలు ఎన్నో జరిగినందుకు మా నాన్న తన ఫ్యామిలీ ఆల్బంలో "లిపి మా ఫ్యామిలో జోకర్" అని రాసారు. అది చదివి నేను ఆనందించినా, "నువ్వా? నేను కదా అందరిని ఎక్కువ నవ్వించేది?" అని ఊహ నిరాశపడింది. కానీ మా నాన్న హ్యూమర్ ముందు మేమిద్దరం సరిపోము.

ఓ రోజు మేము డిన్నర్‌కి వెళ్ళినప్పుడు ఓ కాప్ తన కీస్‌ని కార్‌లోనే వదిలేయడం గమనించాము.

"ఎవరైనా కార్ ఎత్తుకుపోతే ఆ కాప్‌కి ఎంత అవమానం" అని మా అమ్మ.

"మేబీ పట్టుకుంటే పెద్ద శిక్ష పడుతుందని ఎవరూ దొంగతనం చేసే సాహసం చెయ్యరని కార్‌లోనే కీస్ వదిలేసాడేమో" అని నేను కొద్దిసేపు చర్చిముకున్నాక

"మీరేమంటారు?" అని నాన్నని అడిగాము.

"కార్ దొంగిలించక్కర్లేదు. అందులోంచి కీస్ తీసుకుంటే సరిపోతుంది. సెక్యూరిటీ కెమేరా లేకపోతే పట్టుకోవడం కష్టం" అన్నారు.

"ఓ.. ఔను కదా" అని నేను, మా అమ్మ మెదడుకు మేతేసాము.

నిజానికి నేను రాయడం మొదలుపెట్టినప్పుడు అందరూ మా నాన్న పోలిక అనుకున్నారు. కానీ నేను కథలు కాక కవితలు రాసేదాన్ని. మా అమ్మ రాసిన ఎన్నో అద్భుతమైన కవితలను చదవడంవల్ల నాకు రాసే పోలిక అమ్మ నుండి వచ్చిందనుకున్నాను. కానీ ఈ కాలమ్ రాయడం మొదలు పెట్టాక నా శైలి, మా నాన్న శైలికి దగ్గరగా ఉందని కొంత మంది చెప్పడంతో మా అక్కలకి కాక అమ్మా నాన్నల పోలిక కేవలం నాకే రావడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నాను.

నా వయసువారికన్నా మా నాన్న చాలా విషయాల్లో ఎంతో ఫార్వర్డ్. ఓసారి నేను కొనుక్కున్న కళ్ళజోడుని చూసి అందరూ "గాంధీతాత గ్లాసెస్‌లా ఉన్నాయి" అన్నారు. మా నాన్న ఒక్కరే "ఇది హేరీ పాటర్ లాంటి కళ్ళజోడు" అని గుర్తుపట్టారు. చిన్నప్పుడు మా నాన్నే నా బెస్ట్ ఫ్రెండ్ కావడంతో నాతో సీక్రెట్స్ పంచుకోడానికి ముందు "నాన్నకి చెప్పకు" అని ఒట్టేయించుకునేవారు. ఈరోజుకీ రాత్రిపూట వచ్చే కలల్లో నేను మా నాన్న మోకాలివరకే ఉంటాను. ఆఫీసుకి సంబంధించిన కలలు వచ్చినా అవి జరిగేది నేను పెరిగిన ఇంట్లోనే. చిన్నప్పుడు, నేను, మా అమ్మ, అక్కలు మొక్కలకి నీళ్ళు పోయడం, తలుపు వెనక నిలబడి అందరినీ 'భౌ' అని భయపెట్టడం, ఏ దిగులూ లేకుండా మేడమీద కేరింతలు కొట్టడం - నాకు అరవై ఏళ్ళొచ్చినా కలలో కేవలం ఆరేళ్ళే ఉంటాయి కాబోలు.

మంచి అలవాట్లు చిన్న వయసునుండే నేర్పాలని మా నాన్నకి తెలుసు కనుక నేను రాయడం నేర్చుకున్నప్పటినుండి రోజూ రాత్రి డైరీ రాయడం అలవాటు చేసారు. ఊహ తెలిసినప్పటినుండి వయసులో నాకన్నా పెద్దవారికి అంతస్తులో తేడా చూడకుండా మర్యాదనివ్వడం నేర్పారు. ఇబ్బందుల్లో ఉన్నవారికి సహాయం చెయ్యడం చేతల్లో చూపించారు. పిచ్చిమాటలు లేకుండా స్వచ్ఛమైన భాష మాట్లాడడం మొదటినుండే అలవాటు చేసారు. అనవసరపు ముద్దుమాటలు, వెకిలి వేషాలు ఎన్నడూ మా జీవితంలో భాగం కానివ్వలేదు. డబ్బూ, అందం, హోదాకాదు గుణం, బుద్ధి, మనస్తత్వం ముఖ్యం అని మాకు తెలియకుండానే మాలో నాటారు. చిన్నప్పటినుండీ మా అమ్మకి అసహ్యమైన మూడు పనులు మేము చెయ్యకుండా పెంచింది. - వెన్నుపోటు పొడవడం, దొంగతనం చెయ్యడం, వెక్కిరించడం. పెంపకాన్ని బట్టే మనుషుల ప్రవర్తన ఉంటుందని నేను ముమ్మాటికీ నమ్ముతాను.

మా నాన్నపై నాకున్న మమకారానికి తను పేరు ప్రఖ్యాతులు పొందిన రచయిత అని, పుస్తకప్రియులు మా నాన్నని వారి సొంత మనిషిలా భావిస్తారని మర్చిపోతుంటాను. ఫేస్ బుక్‌లో ఒకరు మా నాన్న రాసిన ట్రావెలాగ్ యూరోప్‌లో డస్ట్‌బిన్ పై ఇండియా అని రాసుందన్న వాక్యాల గురించి చెప్తూ "మల్లాది తన ట్రావెలాగ్‌లో రాసాడు" అని పోస్ట్ చేసారు. మా నాన్నని 'డు' అంటాడా అని నా ఒళ్ళు మండిపోయింది.

"మీ నాన్న పబ్లిక్ ఫిగర్ లిపి. గాంధీ ఇలా అన్నాడు అన్న విధంగా రాసుంటారు" అని నా ఫ్రెండ్ సంజాయిషీ ఇచ్చాకా నేను శాంతించాను. రైట్స్ కొనాలంటే డబ్బు ఖర్చవుతుందని దొంగతనంగా మా నాన్న నవలలని ఎన్ని సినిమాలకి వాడారో చాలామందికి తెలుసు. అలా ఇల్లీగల్‌గా సినిమాలు తీసినవారు పైరేసీకి వ్యతిరేకంగా మాట్లాడడం నాకు ఎంతో ఆశ్చర్యంగా ఉంటుంది. ఓసారి పియోరియాలో ఒక ఫ్రెండ్ తెలుగు సినిమా గురించి అడిగితే "డోంట్ వాచ్. హి స్టీల్స్ ఇంటలెక్చుయల్ ప్రాపర్టీ" అని చెప్పాను. మా నాన్న శ్రమని ఒకరు దొంగలించడం నేను భరించలేను. ఇప్పటివరకు ఎంతోమంది పై రిపోర్ట్, ఫిర్యాదు చెయ్యడమేకాక ఇంటర్నెట్‌లోంచి కొన్ని వెబ్ సైట్లు డిలీట్ చేయించి కాలిఫోర్నియాలో ఒకరికి, హైదరాబాదులో ఒకరికి లాయర్ ద్వారా నోటీసుకూడా పంపాను. కేవలం మా నాన్నపైనే కాక తన ప్రొఫెషన్ పై నాకు గౌరవం కలగడానికి ముఖ్యంగా రెండు కారణాలు ఉన్నాయి. ఒకటి - మా నాన్న శ్రమని చూస్తూ పెరగడం, రెండు - తను బయటవారివల్ల ఏ విధంగాను దెబ్బతినకూడదన్న తపన.

"నువ్వైనా మీ నాన్నకి చెప్పచ్చుకదా ఫోటో వెయ్యమని" అని ఎంతో మంది అడిగారు.

ఆయన పెంపకంలో పెరిగిన మేము అలాంటివి కోరతామనుకోవడం మూర్ఖత్వం. ఒక పాతికేళ్ళ కుర్రాడ్ని అటు ప్రొడ్యూసర్లు, ఇటు డైరెక్టర్లేకాక వేలమంది జనాలు ఆదరించినా తన కాళ్ళని భూమిపైనే ఉంచి, అంత చిన్న వయసులోనే ఎంతో ప్రాక్టికల్‌గా ఓ నిర్ణయాన్ని తీసుకున్నారు. ఎంత డబ్బు చూపించినా, ఎంత బతిమలాడినా, ఎంత కాకాపట్టినా తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. సినిమా ఇండస్ట్రీ రంగుల మాయలో పడలేదు. జనాల పొగడ్తలకి లొంగలేదు. సన్మానాలకి ఆకర్షింపబడలేదు. 'ప్రజలు నన్ను కేవలం నా పుస్తకాల ద్వారానే తెలుసుకోవాలి. నా ముఖం తెలియాల్సిన అవసరంలేదు. మా అమ్మాయికి నేను సాధారణ తండ్రిలా ఐస్క్రీం, పానీపూరీ తినిపించగలగాలి. నా భార్యతో షాపుకెళ్ళి చీరలు కొనాలి. ఎవరూ నన్ను పరిశీలించకుండా రోడ్డుపై స్వేచ్ఛగా నడవగలగాలి. ఎవరూ నన్ను ఇబ్బందిపెట్టకుండా బండివాడి మొక్క జొన్నపొత్తు తినగలగాలి" అని ఆ పాతికేళ్ళు కూడా లేని ఆ అబ్బాయి తీసుకున్న నిర్ణయాన్ని తన భార్య, పిల్లలేకాక ఇంటికొచ్చిన అల్లుడు కూడా ఎంతో గర్విస్తున్నారు.

ఏ మాయలోనూ పడకుండా, ఎటువంటి వ్యామోహాలూ లేకుండా, ప్రపంచం తన చుట్టూ తిరుగుతున్నా తన లక్ష్యాన్ని ఎన్నడూ మరవలేదు. రోజుకి పధ్నాలుగు గంటలు రాస్తూ, చెయ్యి నొప్పి, అలసటలను అధిగమించి, పాఠకుల కోసం ఎన్నో పుస్తకాలు రాసారు. ఫోన్ చేసిన ప్రతి ఒక్కరితో మాట్లాడారు. ఇంటికొచ్చిన వారు ఎన్ని గంటలు కూర్చున్నా నవ్వుతూ కబుర్లు చెప్పారు. సినిమాలకి, సీరియల్స్‌కి కథలు, డైలాగులు, మొదలగున్నవి ఎన్నో చేసారు. ఎప్పుడూ డబ్బు ఆశించలేదు. ఎంతమంది డబ్బు ఎగ్గొట్టినా పాఠకుల కోసం తన శ్రమని ధారపోసారు. ఏదీ ఆశించకుండా అన్ని చేసిన ఆయన ప్రజలనుండి కోరుకునేది ఒక్కటే - నా ఫోటో ఎక్కడా ప్రచురించకండి. ప్రతి ఇంటర్వ్యూలోనూ అదే అర్థించారు. అదే మాటపై అడిగిన ప్రతీ ఒక్కరితో ఫోటో తీయించుకున్నారు.

కొన్నివారాల క్రితం మా నాన్న ఫోటోని చూడాలని కొందరు ఎగబడడం నాకు ఎంతో కోపాన్ని తెప్పించింది. అలాంటి వారికి మా నాన్న రచనలు చదివే హక్కులేదనిపించింది. పేరుపేరునా ప్రతీ ఒక్కరిని తిట్టాలనిపించింది.

దానికి మా నాన్న అడ్డుపడి "చదివే వాళ్ళ తప్పుకాదమ్మా. వాళ్ళకి నన్ను చూడాలని కుతూహలంగా ఉంటుంది. అందుకే అలా అడుగుతున్నారు. నేను రాసే వాటిపై అభిమానం నాపైకి మళ్ళీ నేను ఎలా ఉంటానో చూడాలని ఆశిస్తున్నారు. అది హ్యూమన్ మెంటాలిటీ. వాళ్ళని ఏమీ అనకు. తప్పు చేసింది వాళ్ళుకాదు" అని అలాంటి పరిస్థితిలో కూడా పాఠకులవైపు నుండే ఆలోచించారు. అంత మంచి మనిషిని మళ్ళీ ఎవరూ నొప్పించరని ఆశిస్తున్నాను.

నేను ఈ ధారావాహిక రాయడానికి కారణం మా నాన్న రాసిన ఫ్యామిలీ ఆల్బం అని నా మొదటి ఎపిసోడ్‌లో రాసాను. ఆ కారణాన్ని వచ్చేనెల నా ఆఖరి ఎపిసోడ్‌లో వివరిస్తాను.

*(నాన్నకబుర్లు మరిన్ని వచ్చేనెలలో)*

Click here to share your comments on this story